క్లుప్తంగా

12 మంది విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేస్తున్న యోగాశ్రమ విద్యార్థులు

అమలాపురం టౌన్: స్థానిక శ్రీ స్వామి వివేకానంద యోగాశ్రమానికి చెందిన 12 మంది విద్యార్థులు అమలాపురం, కొత్తపేట, పి.గన్నవరం ప్రభుత్వ ఆస్పత్రుల్లో సోమవారం రక్తదానం చేశారు. రక్తదానం చేసినవారిలో ఐదుగురు దివ్యాంగులు సైతం ఉన్నారని యోగాశ్రమ గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ తెలిపారు. రక్తదానమంటే ప్రాణదానంతో సమానమని అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి బి.కాశి తెలిపారు.

గోతిలో పడిన ఆవు దూడ



గోతిలో పడిన ఆవు దూడ

అమలాపురం టౌన్: స్థానిక రవణంవీధిలోని గరిగుంట చెరువు వద్ద మొక్క పాతేందుకు తీసిన గోతిలో సోమవారం ఓ ఆవు దూడ పడిపోయింది. పైకి రావడానికి ఎంత ప్రయత్నించినా రాలేకపోయింది. స్థానికులు స్పందించి ఆవుదూడను గోతి నుంచి సురక్షితంగా బయటకు తీశారు.

9న లోక్ అదాలత్

అమలాపురం టౌన్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో వచ్చే నెల 9వ తేదీన అమలాపురం కోర్టు భవనాల సముదాయంలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో నేషనల్ లోక్ అదాలత్ నిర్వహించనున్నామని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, జిల్లా రెండో అదనపు కోర్టు న్యాయమూర్తి వి.నరేష్ సోమవారం తెలిపారు. లోక్ అదాలత్‌లో వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు, బ్యాంక్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, రాజీ పడ తగ్గ క్రిమినల్ కేసులు పరిష్కరిస్తారన్నారు. కక్షిదారులు అధిక సంఖ్యలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లోక్ అదాలత్‌కు న్యాయవాదులు, పోలీసు, బ్యాంక్, రెవెన్యూ అధికారులు హాజరై ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా సహకరించాలని కోరారు.

మే నుంచి రైల్వే పిల్లర్లపై గడ్డర్ల పనులు

అమలాపురం టౌన్: కోనసీమ రైల్వే ప్రాజెక్ట్‌లో భాగంగా కోటిపల్లి గౌతమీ నది వద్ద ఇప్పటికే నిర్మించిన పిల్లర్లపై గడ్డర్ల ఏర్పాటు పనులు మే నెల నుంచి చేపట్టేందుకు సంబంధిత కాంట్రాక్ట్ సంస్థ సన్నాహాలు చేస్తోందని కోనసీమ జేఏసీ కన్వీనర్ బండారు రామ్మోహనరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గతేడాది నవంబర్‌లోనే టెండర్ల ప్రక్రియ పూర్తయినా పనులు మొదలుపెట్టకపోవడంపై తాను హైదరాబాద్‌లోని కాంట్రాక్ట్ సంస్థ అయిన ప్రసాద్ అండ్ కంపెనీ లిమిటెడ్ కార్యాలయాన్ని సందర్శించి సంస్థ అధికారులతో మాట్లాడానన్నారు. గడ్డర్లకు ఇప్పటికే ఆర్కిటెక్ట్‌తో డిజైన్లు సిద్ధం చేసి రైల్వే శాఖ కార్యాలయానికి పంపించామని, మే నుంచి పనులు ప్రారంభిస్తామని సంస్థ అధికారులు బదులిచ్చారని ఆయన తెలిపారు.

ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన

తాళ్లరేవు: ప్రాణాంతక ఎయిడ్స్ వ్యాధిపై గొల్రైల రాము బృందం సభ్యులు వీధి నాటకం ద్వారా సోమవారం అవగాహన కల్పించారు. మండల కేంద్రమైన తాళ్లరేవులో జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, ఎలా నియంత్రించాలి అనే అంశాలను కూలంకషంగా వివరించారు.

కన్వీనర్‌పై ఫిర్యాదు

అల్లవరం: మండలంలోని వెదుళ్లపాలెంలో శ్రీరామ డ్వాక్రా గ్రూపు సభ్యులకు స్త్రీ నిధి రుణం మంజూరు చేయకుండా గ్రూపు కన్వీనర్, కో కన్వీనర్, యానిమేటర్, ఏపీఎంలు అడ్డుపడుతున్నారని ఆ సంఘానికి చెందిన సీహెచ్ శ్రీదేవి సోమవారం స్పందనలో ఫిర్యాదుచేశారు. డ్వాక్రా గ్రూపు సభ్యులను కన్వీనర్ చాలా ఇబ్బంది పెడుతున్నారని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను వెలుగు ఏపీఎం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని తమకు న్యాయం చేయాలని కోరారు.

ఫైలు ఆలస్యంపై కేంద్ర హోం శాఖకు ఫిర్యాదు

యానాం: పుదుచ్చేరి నూతన అసెంబ్లీ నిర్మాణానికి సంబంధించిన ఫైలును ఆలస్యం చేస్తున్న ఎల్జీ తమిళిసై సౌందరరాజన్‌పై కేంద్ర హోం శాఖకు ఫిర్యాదు చేసినట్లు స్పీకర్ ఆర్.సెల్వం తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నూతన అసెంబ్లీ నిర్మాణానికి ప్రధాని, లోక్‌సభ స్పీకర్‌తో పాటు కేంద్ర హోంశాఖ మంత్రిత్వశాఖ సైతం ఆమోదం తెలిపిందన్నారు. అనంతరం నివేదిక ఫైలును తయారుచేసి రాజ్ నివాస్‌కు పంపామని, అక్కడ ఫైలును ఆమోదించి కేంద్ర హోంశాఖకు పంపాల్సి ఉందన్నారు. అయితే ఫైలును కదపకుండా అక్కడే ఉంచేయడంతో అసెంబ్లీ నిర్మాణంలో జాప్యం జరుగుతుందన్నారు.

గ్రామాల రూపురేఖలు మారుతున్నాయి

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- చిందాడగరువు, కామనగరువుల్లో అభివృద్ధి పనుల ప్రారంభం



కామనగరువులో రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో జరుగుతున్న అభివృద్ధి వల్ల గ్రామాల రూపురేఖలు మారుతున్నాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. సోమవారం మండలంలోని చిందాడగరువులో నరేగా నిధులు రూ.35 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, జనతా కాలనీలో రూ.18 లక్షల పంచాయతీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును, రూ.25 లక్షలతో చిట్టిమ్మ చెరువు వద్ద నిర్మించిన సీసీ రోడ్డును, గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.35 లక్షలతో నిర్మించిన మండల పరిషత్ పాఠశాల, అంగన్‌వాడీ భవనాన్ని, రూ.కోటి నిధులతో కామనగరువు ఆర్‌అండ్‌బీ రోడ్ నుండి పసిడి చెరువు వరకూ నిర్మించిన బీటీ రోడ్డును ఆయన ప్రారంభించారు. చిట్టిమ్మ చెరువు వద్ద పాఠశాలకు స్థలం దానం చేసిన దాత గిడ్డి గనికమ్మను మంత్రి విశ్వరూప్ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తూ అభివృద్ధి సాగిస్తుండడంతో ప్రజల మన్ననలు అందుకుంటున్నారన్నారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాల ఏర్పాటుతో గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకొచ్చారన్నారు. సచివాలయ వ్యవస్థతో అన్ని సేవలు గ్రామాల్లోనే లభించడంతో ప్రతి గ్రామం మినీ కలెక్టరేట్‌ని తలపిస్తోందని చెప్పారు. రైతు సంక్షేమమే పరమావధిగా ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రతిఒక్కరికీ సొంతిల్లు ఉండాలనే లక్ష్యంతో ఇంటి స్థలం మంజూరు చేసి ఇళ్లను నిర్మించిన ఘనత ఒక్క జగనన్నకే దక్కుతుందన్నారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, విదేశీ విద్యాదీవెన వంటి పథకాలతో పేదల విద్యకు బాసటగా నిలిచిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, సర్పంచులు నక్క అరుణకుమారి, పి.గణేష్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, డాక్టర్ శ్రీకాంత్, ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, ఎంపీటీసీలు మెండు గంగాభవానీ, సునీత, పీఆర్ డీఈఈ రాజ్‌కుమార్, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పొన్నాడ పరామర్శ



గుత్తులవారిపాలెంలో మల్లేశ్వరరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తదితరులు

తాళ్లరేవు: మండలంలోని పలు బాధిత కుటుంబాలను ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ సోమవారం పరామర్శించారు. కోరంగి పంచాయతీ చినబొడ్డు వెంకటాయపాలెంలో భార్యా వియోగంతో బాధపడుతున్న మాజీ ఎంపీటీసీ సభ్యుడు వైదాడి శ్రీనివాస్‌ను ఎమ్మెల్యే పొన్నాడ పరామర్శించి ఓదార్చారు. గుత్తులవారిపాలెంలో పితృ వియోగంతో బాధపడుతున్న సీనియర్ పాత్రికేయుడు గుత్తుల మల్లేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం ఇటీవల తాళ్లరేవులో మృతి చెందిన కాంట్రాక్టర్ కేమిశెట్టి నాని కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పొన్నాడ పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, సర్పంచ్ పెయ్యల మంగేష్, ఎంపీటీసీ సభ్యులు పోతుల రత్నకుమారి, రేకాడి నరసింహమూర్తి, కొపనాతి నాగరాజు, అంకాడి అంజిబాబు, ఆకుల వెంకటేశ్వర్లు, బొంతు మోహన్ తదితరులున్నారు.

ప్రభుత్వ ఖాతాకు పరిహారం సొమ్ము

యానాం: స్థానిక నియోజకవర్గ పరిధిలో ఓఎన్‌జీసీ సంస్థ కార్యకలాపాల వల్ల నష్టపోతున్న మత్స్యకారులకు అందిస్తున్న పరిహారం సొమ్ము సోమ, మంగళవారాల్లో ప్రభుత్వ ఖాతాకు జమవుతుందని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఖాతాలో జమ అయిన సొమ్ము తిరిగి కొద్దిరోజుల్లోనే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో పడుతుందన్నారు. పరిహారం పక్కదారి పట్టకుండా నేరుగా లబ్ధిదారులకు చేరాలన్నదే తన లక్ష్యమన్నారు.

పైపులైన్ నిర్మాణానికి భూమి పూజ

అల్లవరం: మండలంలోని గుండెపూడి పంచాయతీ పరిధిలోని అగ్నికుల క్షత్రియ పాలెంలో ఇంటింటికీ పైపులైన్ నిర్మాణం, కుళాయిల ఏర్పాటుకు సర్పంచ్ గుంటూరి కృష్ణంరాజు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఆరు నెలల క్రితమే వేదాంత సీఎస్‌ఆర్ నిధులతో ఓహెచ్‌ఆర్ ట్యాంక్ నిర్మించారని, ఇంటింటికీ తాగు నీరిచ్చేందుకు తాను రూ.4.5 లక్షల సొంత నిధులతో పైపులైన్ నిర్మాణం, కుళాయి ఏర్పాటు చేస్తున్నానని సర్పంచ్ కృష్ణంరాజు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాకే కృష్ణమూర్తి, ఉప సర్పంచ్ పోతుల రఘు, వైఎస్సార్ సీపీ గ్రామకమిటీ అధ్యక్షులు కృష్ణంరాజు, మాజీ సర్పంచ్ పినిపే ప్రకాశరావు, మాజీ ఎంపీటీసీ కొపనాతి వెంకటేశ్వరరావు, కూసంపూడి కాశీరాజు పాల్గొన్నారు.

ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవం

కాట్రేనికోన: మండలంలోని బ్రహ్మసమేధ్యంలో కాలభైరవస్వామి నూతన ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవం సోమవారం ప్రారంభమైంది. సుమారు 200 ఏళ్ల చరిత్ర గల పురాతన కాలభైరవ స్వామి ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ప్రోత్సాహంతో దాతల ఆర్థిక సాయంతో నూతన ఆలయాన్ని నిర్మించారు. ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవంలో మొదటి రోజు ఋత్విక్కులు జీర్ణోద్ధారణ, గణపతి పూజ, పుణ్యాహ వచనం, పంచగవ్యం, అగ్నిప్రతిష్ఠాపన, ధ్వజారోహణం తదితర పూజలు చేశారు. పూజల్లో సర్పంచ్ మల్లాడి వీరబాబ్జి, మాజీ సర్పంచ్ మల్లాడి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో లోక్‌సభ అభ్యర్థి ఎంపిక

యానాం: పుదుచ్చేరి ఏకైక లోక్‌సభ స్థానానికి పోటీ చేసే అభ్యర్థిని మరో రెండు రోజుల్లో బీజేపీ ప్రకటించనున్నట్లు బీజేపీ పార్టీ ఇన్‌చార్జి నిర్మలాకుమార్ సురేనా తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే అభ్యర్థి ఎంపిక గురించి దశలవారీగా సమావేశాలు నిర్వహించామని, చివరిగా సీఎం రంగసామితో సైతం చర్చించి అభ్యర్థి పేరును కేంద్ర బీజేపీ కమిటీ ఆమోదానికి పంపిస్తామన్నారు. అభ్యర్థిని సీఎం రంగసామి వెల్లడిస్తారన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ

అమలాపురం రూరల్: పట్టణంలో జరిగిన ఉభయ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ పోటీల్లో ఇందుపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని శశికళ ప్రతిభ కనబరిచింది. 75 కేజీల బెంచ్ ప్రెస్, 35 కేజీలు, 100 కేజీల్లో డెట్ లిఫ్ట్, 66 కేజీల విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ గెలుచుకుంది. ఈ సందర్భంగా శశికళను ఉపవిద్యాశాఖాధికారి నరసింహం, ప్రధానోపాధ్యాయుడు వి.శ్రీనివాసరావు, పీఈటీ వి.నరసింహారావు, ఉపాధ్యాయులు అభినందించారు. శశికళ మరిన్ని పతకాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ముమ్మిడివరం: రోడ్డు ప్రమాదంలో గాయపడి అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అమలాపురానికి చెందిన యండమూరి లోకేష్(22) సోమవారం ఉదయం మృతి చెందాడు. ఈ నెల 18న అనాతవరం గుబ్బలవారిపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందగా ఆ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లోకేష్ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతదేహానికి అమలాపురం ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

ఇంటర్ విద్యార్థుల వీడ్కోలు సమావేశం



వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కాట్రేనికోన: కాట్రేనికోన జెడ్పీహెచ్‌లో ఉన్న జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో ఏడాది పూర్తి చేసుకున్న మొదటి బ్యాచ్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మార్చి 1న ఇంటర్ మొదటి ఏడాది విద్యార్థులకు, 2న ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు ఉన్నాయన్నారు. విద్యార్థులంతా ఆయా పరీక్షల్లో ఉత్తీర్ణులై కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమాదేవి, ఎన్.సత్యనారాయణ, బి.శ్రీరామచంద్రరాజు, ఎన్.శ్రీనుబాబు, కె.పల్లారావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల అభివృద్ధికి రూ.50 వేలు

ఆలమూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి మోదుకూరుకు చెందిన వ్యాపారవేత్త గుణ్ణం వీర్రాజు రూ.50 వేల విరాళం అందించారు. స్థానిక కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నరసింహస్వామి అధ్యక్షతన సోమవారం కళాశాల ప్రణాళిక, అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. సీపీడీసీ కార్యదర్శి గారపాటి త్రిమూర్తులు, న్యాయవాది ఎస్‌కే షరీఫ్, ఎంఈఓ పీవీ సుబ్బరాజు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్ జి.శ్రీనివాసరావు, వైద్యాధికారి పి.భవానీశంకర్ పాల్గొన్నారు. 2024-25 విద్యా సంవత్సరం నుంచి కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో మొట్టమొదటగా జాయిన్ అయిన 15 మంది విద్యార్థులకు (కోర్సుకు 15 మంది చొప్పున) కళాశాల అభివృద్ధి కమిటీ పూర్తి ఫీజులు చెల్లిస్తుందని సమావేశంలో తీర్మానించారు. ఫ్లెక్సీలు, ప్రచార పత్రాలకు తాను వితరణ చేస్తానని న్యాయవాది షరీఫ్ అన్నారు. కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కమిటీ సభ్యుడు వీర్రాజు రూ.50 వేలను విరాళంగా అందజేశారు.

ఆరోగ్యశ్రీ కార్డులు వేగంగా అందించాలి

కొత్తపేట: రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆరోగ్యశ్రీ కార్డులు నూరు శాతం పంపిణీ చేయాలని ఎంపీడీఓ కె.వాణి సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ ప్రభుత్వ కార్యక్రమాలపై గ్రామ సచివాలయాల కార్యదర్శులు, వానపల్లి, అవిడి పీహెచ్‌సీల పరిధిలోని ఏఎన్‌ఎంలు, పశువైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలు కార్పొరేట్ వైద్య సేవలు పొంది, సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలనే సంకల్పంతో ప్రభుత్వం నూతన ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు చేసిందన్నారు. వాటిని వలంటీర్ల ద్వారా ప్రజలకు పంపిణీ చేస్తున్నారన్నారు. ఈ కార్డులు త్వరితగతిన అందరికీ పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు సూచించారు. గ్రామాల్లో బల్క్‌మిల్క్ సెంటర్ల ద్వారా ప్రభుత్వం త్వరలో పాల సేకరణకు చర్యలు చేపట్టిందని, ఆ మేరకు తగిన ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించాలన్నారు. మార్చి 3న పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయాలని ఏఎన్‌ఎంలకు సూచించారు. పేరవరం పశు వైద్యాధికారి, జగనన్న పాల వెల్లువ మండల నోడల్ అధికారి ఎ.రవితేజ, ఈఓపీఆర్డీ సుబ్బారావు, గ్రామ కార్యదర్శులు వీవీ రామన్, మంగిపూడి రాంబాబు, ఎస్.రెడ్డినాయుడు, పి.సత్తిబాబు, శాంతి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దు

అంబాజీపేట: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ అవసరాలకు అందిస్తున్న స్మార్ట్ విద్యుత్ మీటర్లను ఎట్టి పరిస్థితుల్లో తీసుకునేది లేదని సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, రైతులు బొంతు పెదబాబు తెలిపారు. అంబాజీపేట విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద రైతులకు స్మార్ట్ విద్యుత్ మీటర్లపై ఏడీఏ జి.అన్నవరం అధ్యక్షతన సోమవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతులకు 9 గంటల పాటు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. రైతు ఎన్ని యూనిట్లు వినియోగించారో ఈ స్మార్ట్ విద్యుత్ మీటరు ద్వారా తెలుసుకుని, సదరు రైతుల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా సొమ్ము జమ చేస్తారన్నారు. వాటిని తిరిగి విద్యుత్ శాఖ జమ చేసుకుంటుందన్నారు.

బ్రహ్మోత్సవాలకు విరాళం

ఆలమూరు: చింతలూరులో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు రూ.70 వేలు విరాళంగా అందించారు. ఈ నెల 29న ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఐదు రోజుల పాటు సుమారు 15 వేల మంది భక్తులకు అన్నదానం చేసేందుకు ఆలయ కమిటీ నిర్ణయించింది.

దీనికి అయ్యే రూ.70 వేలతో కూరగాయలను కొనుగోలు చేసేందుకు గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు దాత రాంబాబుకు ఆధ్యాత్మిక గ్రంథాన్ని అందజేశారు. అల్లంరాజు భరణీ, నామాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విలసలో వీరభద్రుని సంబరం

అయినవిల్లి: విలసలో కరికాల భక్తుల ఆధ్వర్యంలో వీరభద్రుని సంబరం నిర్వహించారు. 12 మంది భక్తులు బుగ్గలకు, కంఠానికి శూలాలు గుచ్చుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. తొలుత వీరభద్రునికి విశేష పూజలు, ప్రత్యేక హోమం నిర్వహించారు. భూమాడి వీర్రాజు ఆధ్వర్యంలో కారికాల భక్తులను గ్రామంలో ట్రాక్టర్‌పై ఊరేగించారు. సాయంత్రం భక్తులు అగ్నిగుండం తొక్కారు. తర్వాత అన్నదానం చేశారు. అలాగే అయినవిల్లిలో వీరభద్రుని సంబరం నిర్వహించారు.

సత్తెమ్మ తల్లి ఆలయంలో చండీ హోమం



అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు



ఆలయంలో చండీ హోమం చేస్తున్న అర్చకులు

ముమ్మిడివరం: మండలంలోని సీహెచ్ గున్నేపల్లి శ్రీసత్తెమ్మ తల్లి జాతర, తీర్థ మహోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి చండీ హోమం, కుంకుమ పూజలు నిర్వహించారు. బ్రహ్మశ్రీ బాదంపూడి శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛారణల మధ్య గణపతి పూజ, మహా కుంభాభిషేకం, చండీ హోమం, రుద్ర హోమం జరిపారు. వందలాది మంది ముత్తైదువుల సమక్షంలో అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేశారు. అమ్మవారి జాతర మూడో రోజు బాజాభజంత్రీలు, గరగ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ వైభవపేతంగా జరిగింది.

వైభవంగా వీరభద్రుని సంబరం



స్వామి దర్శనానికి వచ్చిన భక్తులు

తాళ్లరేవు: పవిత్ర మాఘమాసం సందర్భంగా మండలంలోని పలుచోట్ల వీరభద్రుని సంబరాలు వైభవంగా జరిగాయి. ప్రధానంగా కాపులపాలెంలో జరిగిన తీర్థ మహోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ గద్దె వద్ద నేతికుండలో వెలిసిన వీరన్నబాబును దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. స్థానిక నాగేంద్రుని పుట్ట భక్తులు పూజలు చేశారు. యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంతానంలేని వారు నదీస్నానం చేసి ఉపవాసంతో వీరభద్రునికి పూజ చేయడం ద్వారా వారి కోరిక నెరవేరుతుందని భక్తుల నమ్మకం. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల సౌకర్యార్థం భారీ అన్న సమారాధన జరిపారు. తాళ్లరేవు రోళ్లవారి వీధిలో వేంచేసియున్న వీరభద్రుని ఆలయం వద్ద కూడా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమాల్లో నరహరిశెట్టి వీరబాబు, నరహరిశెట్టి విఘ్నేశ్వరరావు, ధనరాజు, కామిరెడ్డి గంగరాజు, కశిరెడ్డి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

నక్షత్ర పూజల్లో పాల్గొన్న పీఠాధిపతి



విలసవిల్లిలో అర్చకులతో పీఠాధిపతి చైతన్యానందస్వామి

ఉప్పలగుప్తం: మండలంలోని విలసలవిల్లి రామ మందిరంలో జరుగుతున్న నవగ్రహ నక్షత్ర పూర్వక మహా సౌరయాగంలో విజయనగరానికి చెందిన శ్రీసమతానంద దుర్గా మహా పీఠాధిపతి శ్రవణ చైతన్యానందస్వామి సోమవారం పాల్గొని సౌర విశిష్టతను తెలియజేస్తూ ప్రవచనాలు అందించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతన వల్లే మానవులు ధర్మ మార్గంలో ఉంటారన్నారు. అనంతరం యాగకర్త రామకృష్ణ శర్మను స్వామిజీ అభినందించారు. నక్షత్ర పూజల్లో భాగంగా అర్చకులు మున్నంగి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ఉత్తరా నక్షత్ర జాతకులచే జువ్వి చెట్టుకు పూజలు చేయించారు.

కార్యదర్శులు రెట్టింపు ఉత్సాహంతో పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ రాజేశ్వరరావు

అల్లవరం: వివిధ ప్రభుత్వ పథకాల అమలులో అల్లవరం మండలం ప్రథమ స్థానంలో కొనసాగుతుందని, కార్యదర్శులు ఇదే పంథాను కొనసాగిస్తూ రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని డీఎల్‌డీఓ ఎస్‌టీవీ రాజేశ్వరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కృష్ణమోహన్ అధ్యక్షతన సోమవారం కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, డీఎల్‌డీఓ రాజేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ శేషగిరిరావు మాట్లాడుతూ కుల గణన సర్వే, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, ఆడుదాం ఆంధ్రా, ఆరోగ్యశ్రీ పథకాల్లో అల్లవరం మండలం జిల్లాలోనే ప్రథమ స్థానంలో రావడం అధికారుల కష్టానికి తగిన ఫలితమన్నారు. డీఎల్‌డీఓ మాట్లాడుతూ ఎంపీడీఓ పర్యవేక్షణలో అల్లవరం మండలం మంచి ఫలితాలను సాధిస్తుందన్నారు. ప్రజలకు కార్యదర్శులు అందుబాటులో ఉంటూ, మండలాన్ని మరింతగా అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శులు ఎస్‌వీవీ సత్యనారాయణ, రాజమోహన్, కేవీవీ సత్యనారాయణ, పి.శ్రీనివాస్, చిక్కం శ్రీను, శ్రీరామచంద్రమూర్తి, గ్రేడ్–5 కార్యదర్శులు కుమారి, మృదుల, కనకమ్మ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

జనసేనకు రెండు ఎస్సీ సీట్లిస్తే రాజీనామా చేస్తాం

టీడీపీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు బడుగు సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు బడుగు సత్యనారాయణ

అమలాపురం రూరల్: టీడీపీ, జనసేన పార్టీల పొత్తులో భాగంగా జనసేన అమలాపురం, రాజోలు రెండు ఎస్సీ నియోజకవర్గాలు కోరడం సముచితం కాదని టీడీపీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు బడుగు సత్యనారాయణ అన్నారు. సోమవారం ఆయన అధ్యక్షతన అమలాపురంలోని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు నివాసం వద్ద ఎస్సీ నేతలంతా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బడుగు సత్యనారాయణ మాట్లాడుతూ టీడీపీ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తూ కోట్లాది రూపాయలు ఖర్చు చేసిన దళిత నాయకులను కాదని జిల్లాకు సంబంధం లేని వ్యక్తులను తీసుకొచ్చి సీటు ఇవ్వడమంటే జిల్లాలోని దళితులను అవమానపరచడమే అన్నారు. రెండు ఎస్సీ నియోజకవర్గాల సీట్లు జనసేన పార్టీకి ఇస్తే టీడీపీలో దళితులకు సరైన గుర్తింపు లేదని భావించి పార్టీకి రాజీనామా చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు పాలమూరి ధర్మపాల్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఈతకోట నాగేశ్వరరావు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మందా గెద్దయ్య, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పండు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



సఖినేటిపల్లి లూథరన్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు

సఖినేటిపల్లి: స్థానిక లూథరన్ ఉన్నత పాఠశాలలో సోమవారం 1979–80 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం జరిగింది. పాఠశాల కరస్పాండెంట్ నల్లి ప్రేమానందం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆ బ్యాచ్‌కు చెందిన స్నేహితులంతా ఒకచోట కలుసుకుని అలనాటి జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలుగా, రాజకీయ, వ్యాపార వేత్తలుగా స్థిరపడిన వారంతా ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. పాఠశాల హెచ్‌ఎం గెడ్డం రమేష్‌బాబు, పి.విజయానందం, పీడీ విల్సన్, గెడ్డం యోహాన్, గొల్ల విజయరత్నం, డి.జగదీప్ కుమార్, డి.సువర్ణరత్నం, ఎస్.మాణిక్యాలరావు, నల్లి శుభాకర్‌బాబు, ఐ.శుభాకర్, సుబ్బరాజు పాల్గొన్నారు.